




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

సోమవారం,
సెప్టెంబరు 29, 2025

సంపుటి : 10 సంచిక :14 రంగారెడ్డి ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ పేజీలు 8 వెల 4/-




# కరూర్ ఘటనలో 40కి చేరిన మరణాలు

**ఘటనపై 24 గంటల్లో నివేదిక సమర్పించాలని గవర్నర్ ఆదేశం**

**ఘటనకు భద్రతా వైఫ్యలమే కారణమన్న అన్నాడీఎంకే**

**బాధిత కుటుంబాలకు 20 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించిన విజయ్**

చెన్నై: తమిళనాడులోని కరూర్‌లో తమిళగ వెట్రికళగం (టీవీకే) పార్టీ అధినేత విజయ్ ప్రచార కార్యక్రమంలో చోటుచేసుకున్న తొక్కిసలాట ప్రమాదమా.. లేక ఏదైనా కుట్ర జరిగిందా? అనే అనుమానాలు తీవ్రమవుతున్నాయి. ఈ ఘటనపై సీబీఐ లేదా సిట్ విచారణ కోరుతూ ఆ పార్టీ న్యాయవాద విభాగం మధురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలు చేసేందుకు సిద్ధమైంది. తొక్కిసలాట ఘటనతో తమిళనాడు సీఎం స్టాలిన్, డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్‌తో పాటు పలువురు మంత్రులు రాత్రికి రాత్రే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఏడీజీపీ దేవిడ్సన్ దేవాశీర్వాదంతో పాటు ఐదుగురు ఐజీలు, డీజీఐలు ఘటనా స్థలంలో విచారణను వేగవంతం చేశారు. ఈ ఘటనలో మొత్తం 40 మంది మరణించినట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో 14 మంది పురుషులు, 17 మంది మహిళలు, 9 మంది చిన్నారులు ఉన్నారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని, మరో వంద మందికి పైగా చికిత్స పొందుతున్నట్టు తెలిపింది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, ప్రతిపక్ష నేత పళనిస్వామితో పాటు డీఎండీకే, బీజేపీ, తదితర పార్టీ ల నేతలంతా

(మిగతా 2వ పేజీలో)

# మహాగౌరీ అమ్మవారు - నవరాత్రుల 8వ రోజు



ఆరాధన : నవరాత్రుల ఎనిమిదవ రోజు మహాగౌరీ అమ్మవారిని ఆరాధిస్తారు. ఈ రోజు పూజ వలన ● మనసు, ఆత్మ శుద్ధి అవుతుంది. ● కష్టాలు తొలగి శాంతి, సౌఖ్యం కలుగుతాయి ● ఆధ్యాత్మిక జ్ఞానం అభివృద్ధి చెందుతుంది.

## మంత్రం

"ఓం దేవీ మహాగౌర్యై నమః"

(ఈ మంత్రాన్ని 108 సార్లు జపించడం శ్రేయస్కరం.)

మహాగౌరీ అమ్మవారు పవిత్రత, శాంతి, కరుణల ప్రతిరూపం. ఆమె రూపం తెల్లని కాంతి వలె ప్రకాశిస్తూ, భక్తులకు ఆత్మశుద్ధి, శాంతి, సౌఖ్యం ప్రసాదిస్తుంది.

**కథ**

పార్వతీదేవి తన భర్తగా శివుడిని పొందడంకోసం నారదుడు ఇచ్చిన సలహాతో తపస్సు చేయటానికి పూనుకుంది. కాబట్టి, ఆమె రాజ భవనాన్ని, అన్ని సౌకర్యాలను విడిచి, అడవికి వెళ్ళి తపస్సు చేయడం ప్రారంభించింది. ఆమె ఎండ, చలి, వర్షం, కరువు, భయంకరమైన తుఫానులను కూడా లెక్కచేకుండా చాలా సంవత్సరాలు కఠిన తపస్సు కొనసాగింది. దాంతో పార్వతి శరీరం దుమ్ము, ధూళి, నేల, చెట్ల ఆకులతో నిండిపోయింది. అప్పుడు ఆమె తన శరీరంపై నల్లటి చర్మాన్ని ఏర్పాటుచేసుకుంది. చివరికి, శివుడు ఆమెముందు ప్రత్యక్షమై, ఆమెను వివాహం చేసుకుంటానని మాట ఇచ్చాడు. అతను తన ముడి వేసిన జుట్టు నుండి వెలువడే గంగా నది పవిత్ర జలాల ద్వారా ఆమెను తడిపాడు. గంగ పవిత్రమైన జలాలు పార్వతికి అంటుకున్న మురికిని కడిగివేయడంతో ఆమె మహిమాన్వితమైన తెల్లని రంగులోకి మారింది. ఆ విధంగా తెల్లని రంగును సంపాదించడం ద్వారా పార్వతిని మహాగౌరి అని పిలుస్తారు.





# ఆపరేషన్ తిలక్

**ఆసియా కప్ టైటిల్ నిలబెట్టుకున్న భారత్**

**టీమిండియాను గెలిపించిన తిలక్ వర్మ**

**ఫైనల్లో పాకిస్తాన్ చిత్తు**

**5 వికెట్లతో ఘనవిజయం**

**కుల్దీప్ యాదవ్‌కు 4 వికెట్లు**

దాదాపు 18 ఏళ్ల క్రితం... టి20 వరల్డ్ కప్ ఫైనల్లో పాకిస్తాన్‌ను ఓడించి భారత్ జగజ్జేతగా నిలిచింది. ఇప్పుడు ఇన్నేళ్ల తర్వాత మరోసారి చిరకాల ప్రత్యర్థితో ఆఖరి సమరంలో గెలిచే అవకాశం వచ్చింది... వరల్డ్ చాంపియన్‌గా తమ స్థాయికి తగిన అంచనాలతో భారత్ మరోసారి ఫేవరెట్‌గా బరిలోకి దిగింది. గత రెండు మ్యాచ్‌ల ఫలితాలు చూస్తే టీమిండియాకు విజయం అతి సులువు అనిపించింది. పాక్ బ్యాటింగ్ ముగిసిన తర్వాత లక్ష్యం మరీ చిన్నదిగా కనిపించింది. కానీ అనూహ్యంగా మ్యాచ్‌లో మలుపులు, ఉత్కంఠ, ఉద్వేగాలు... అన్నీ కలగలిసి మ్యాచ్ ఆఖరి ఓవర్ వరకు వెళ్లింది. సంజు సామ్సన్, శివమ్ దూబేలు తలా ఓ చేయి వేయగా... హైదరాబాద్ ఆటగాడు నంబూరి ఠాకూర్ తిలక్ వర్మ అసలైన హీరోగా అవతరించాడు. ఒత్తిడిని అధిగమించి అద్భుత షాట్లతో చివరి వరకు నిలిచిన తిలక్ చిరస్మరణీయ ఆటతో భారత జట్టును ఆసియా కప్ విజేతగా నిలిపాడు. ఎన్ని టైటిల్స్ గెలిచినా ఫైనల్లో పాకిస్తాన్‌ను ఓడించి సాధించే ట్రోఫీలో కిక్కే వేరు అని మరోసారి రుజువైంది.

దుబాయ్: ఆసియా కప్ టి20 టోర్నీలో భారత్ విజేతగా నిలిచింది. ఓవరాల్‌గా టోర్నీ చరిత్రలో 9వ సారి టైటిల్‌ను సొంతం చేసుకుంది. ఆదివారం హోరాహోరీగా సాగిన ఫైనల్లో భారత్ 5 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను

(మిగతా 2వ పేజీలో)

# ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తును ఆపుతావా?

**కృష్ణానదిపై కర్ణాటక కుట్రను నిలువరించే దమ్ముందా?**

**నల్లమల పులిగా చెప్పుకునే సీఎం రేవంత్ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలి**

**రాహుల్‌గాంధీ తనను ఎప్పుడు తీసేస్తాడోనన్న భయంలో ఉన్నాడు**

**ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కాదు.. కాంగ్రెస్, బీజేపీ జాయింట్ వెంచర్ ప్రభుత్వం**

**సీఎం సొంత గడ్డ నుంచే స్థానిక ఎన్నికల శంఖారావం**

**అచ్చంపేటలో బీఆర్ఎస్ జనగర్జన బహిరంగ సభలో కేటీఆర్**






## జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు పరిశీలకులను నియమించిన కేంద్ర ఎన్నికల సంఘం



## 1న బంగాళాఖాతంలో అల్పపీడనం

**మరోవైపు ఈశాన్య అరేబియన్ సముద్రంలోనూ అల్పపీడనం ఏర్పడే అవకాశం**


**రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మూడురోజుల పాటు వర్షాలు**

# కాల్పుల విరమణ కుదరదు

**మావోయిస్టులు ఆయుధాలు వదిలేసి లొంగిపోవాలి**

**ఆయుధాలు వదిలేస్తే ఒక తూటా కూడా పేల్చం**

**లొంగిపోయే వారికి రెడ్ కార్పెట్ స్వాగతం పలుకుతాం: అమిత్ షా**



న్యూఢిల్లీ: మావోయిస్టులతో కాల్పుల విరమణ ప్రతిపాదనను కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్ షా తిరస్కరించారు. వారిపై దాడుల ఆపే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. 'ఆపరేషన్ బ్లాక్ ఫారెస్ట్'ను నిలిపివేయాలని, కాల్పుల విరమణకు తాము సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు 15 రోజుల క్రితం ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. దీనిపై అమిత్ షా ప్రతిస్పందించారు. వారు ఆయుధాలు వదిలేసి లొంగిపోతామంటే కచ్చితంగా స్వాగతిస్తామని అన్నారు. ఆయుధాలు విడిచిపెట్టిన వారిపై భద్రతా బలగాలు ఒక్క తూటా కూడా పేల్చబోవని స్పష్టంచేశారు. మావోయిస్టుల ప్రతిపాదనపై అమిత్ షా మాట్లాడడం ఇదే మొదటిసారి. ఆదివారం జరిగిన 'నక్సల్ ముక్త్ భారత్' సదస్సులో అమిత్ షా ప్రసంగించారు. ఆయుధం చేతపట్టిన తీవ్రవాదులపై కాల్పులు ఆపాలన్న ఆలోచన ప్రభుత్వానికి లేదని స్పష్టంచేశారు. కాల్పుల విరమణ ఉండదని అన్నారు. నిజంగా లొంగిపోవాలని కోరుకుంటే కాల్పుల విరమణతో

(మిగతా 2వ పేజీలో)

# కరూర్ ఘటనలో 40కి చేరిన మరణాలు



కరూర్‌కు చేరుకుని బాధితులను పరామర్శించారు. ఈ ఘటన ప్రభుత్వ భద్రతా వైఫ్యలమే కారణమని పళనిస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. జనం పెద్దఎత్తున తరలి వస్తున్నారన్న విషయాన్ని గ్రహించడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. విజయ్ సైతం ముందస్తు ఏర్పాట్లు పూర్తిస్థాయిలో చేసుకుని ఉండాల్సిందని హితవు పలికారు. కాగా.. ఈ ఘటనపై 24 గంటల్లో నివేదిక సమర్పించాలని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి డీఎంకే ప్రభుత్వాన్ని ఆదేశించారు.

### సీబీఐ దర్యాప్తునకు టీవీకే డిమాండ్

కరూర్‌లో బాధితుల సమాచారం, మరికొందరు వైరల్ చేస్తున్న వీడియోల ఆధారంగా ఈ ఘటన ప్రమాదమా? లేక కుట్ర జరిగిందా..? అన్న అనుమానాలకు దారితీసింది. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ టీవీకే న్యాయవాది విభాగం బృందం చెన్నైలో న్యాయమూర్తి దండపాణిని కలిసి సుమోటోగా కేసు నమోదు చేయాలని కోరారు. ప్రచారంలో రాళ్లు విసిరినట్టు, లాఠీచార్జ్ జరిగినట్టు వైరల్ అవుతున్న వీడియోల ఆధారంగా ఈ ఘటన పథకం ప్రకారం జరిగిన కుట్రగా న్యాయమూర్తికి వివరించారు. కేసును సీబీఐ లేదా సిట్ ద్వారా విచారించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. పిటిషన్ దాఖలు చేస్తే సోమవారం మధ్యాహ్నం విచారణకు స్వీకరిస్తామని న్యాయమూర్తి సూచించగా.. ఆ దిశగా మద్రాసు హైకోర్టు మధురై ధర్మాసనంలో పిటిషన్ దాఖలుకు చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనలో మృతి చెందిన కుటుంబాల వారికి రూ.20 లక్షల చొప్పున విజయ్ ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడ్డ వారికి రూ.2 లక్షల చొప్పున ప్రకటించారు. తాను సైతం కరూర్ వెళ్లేందుకు సిద్ధమైనా, పోలీసుల నుంచి అనుమతి రాలేదు. కాగా.. విజయ్ ఇంటివైపు కొన్ని విద్యార్థి సంఘాలు దూసుకెళ్లడంతో ఆ పరిసరాలన్నీ సీఆర్‌పీఎఫ్ భద్రతా వలయంలోకి తీసుకున్నారు. ఈ ఘటన నేపథ్యంలో విజయ్ ప్రచారాలపై నిషేధం విధించాలని కోరుతూ సెంథిల్ కన్నన్ అనే బాధితుడు హైకోర్టులో పిటిషన్ వేశాడు. ఇదిలావుండగా కరూర్ ఘటనకు బాధ్యులుగా టీవీకే పార్టీ కరూర్ పశ్చిమ జిల్లా కార్యదర్శి మది అళగన్, ప్రధాన కార్యదర్శి భుస్సీ ఆనంద్, సీనియర్ నేత నిర్మల్‌కుమార్‌తో పాటు ఇతరులు అని పేర్కొంటూ మొత్తం నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మరోవైపు ఈ ఘటనపై జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలో ఏక సభ్య కమిషన్ విచారణ ప్రారంభించింది. వేలుస్వామిపురంలో పరిశీలన, విచారణ జరిగింది. ఘటన సమయంలో విద్యుత్ సరఫరా ఆపేశారంటూ కొందరు, ఒక్కసారిగా జనం తోసుకొచ్చారంటూ మరికొందరు, అంబులెన్స్‌లు వరుసగా రావడంతో వాటికి దారి ఇచ్చే సమయంలో తోపులాట జరిగిదంటూ మరికొందరు తెలిపారు.

# ఆపరేషన్ తిలక్



చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్ 19.1 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌటైంది. సాహిబ్‌జాదా ఫర్హాన్ (38 బంతుల్లో 57బీ 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీ సాధించగా, ఫఖర్ జమాన్ (35 బంతుల్లో 46బీ 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. వీరిద్దరు తొలి వికెట్‌కు 58 బంతుల్లో 84 పరుగులు జోడించారు. పాక్ కేవలం 33 పరుగులకే చివరి 9 వికెట్లు కోల్పోయింది. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ (4/30) ఆకట్టుకోగా... బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి తలా 2 వికెట్లు తీశారు. అనంతరం భారత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లకు 150 పరుగులు చేసి గెలిచింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తిలక్ వర్మ (53 బంతుల్లో 69 నాటౌట్‌బీ 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ అర్ధ సెంచరీ సాధించగా... శివమ్ దూబే (22 బంతుల్లో 33బీ 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), సంజు సామ్సన్ (21 బంతుల్లో 24బీ 2 ఫోర్లు, 1 సిక్స్) అండగా నిలిచి విజయంలో కీలక పాత్ర పోషించారు.

### రాణించిన ఓపెనర్లు...

భారత్‌తో ఆడిన సూపర్-4 మ్యాచ్ తరహాలోనే ఈసారి కూడా పాక్ ఇన్నింగ్స్ జోరుగా మొదలైంది. ఓపెనర్లు ఫర్హాన్, ఫఖర్ పదునైన షాట్లతో సరైన పునాది వేశారు. ముఖ్యంగా ఫర్హాన్ దూకుడు ప్రదర్శిస్తూ బుమ్రా ఓవర్లో ఫోర్, సిక్స్ కొట్టాడు. పవర్‌ప్లేలో 45 పరుగులు చేసిన జట్టు... తర్వాతి 4 ఓవర్లలో 42 పరుగులు రాబట్టడంతో 10 ఓవర్లు ముగిసేసరికి స్కోరు 87 పరుగులకు చేరింది. గత మ్యాచ్‌లో భారత్‌పై పాక్ తొలి 10 ఓవర్లలో వికెట్ నష్టానికి 91 పరుగులు సాధించింది. 35 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న ఫర్హాన్‌ను వరుణ్‌ను అవుట్ చేయడంతో పాక్ తొలి వికెట్ కోల్పోయింది. మూడో స్థానంలో వచ్చిన సయీమ్ అయూబ్ (14) ఈసారి రెండంకెల స్కోరు చేయగలిగాడు. 12.4 ఓవర్లలో జట్టు స్కోరు 113/1 వద్ద నిలిచింది. ఈ దశలో మరో 44 బంతులు మిగిలి ఉండగా పాక్ భారీ స్కోరు సాధించడం ఖాయమనిపించింది. అయితే భారత బౌలర్లు చెలరేగడంతో పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. పాక్ బ్యాటర్లు ఎవరూ కనీసం క్రీజ్‌లో నిలవలేక చెత్త షాట్లతో వరుసగా వికెట్లు సమర్పించుకున్నారు. వరుసగా నాలుగు ఓవర్లలో ఒక్కో వికెట్ చొప్పున అయూబ్, హారిస్ (0), ఫఖర్, తలత్ (1) వెనుదిరిగారు. ఆ తర్వాత ఒకే ఓవర్లో మూడు వికెట్లతో కుల్దీప్ పాక్ పని పట్టాడు. అతడిని ఎదుర్కోలేక సల్మాన్ (8), అఫ్రిది (0), ఫహీమ్ (0) అవుటయ్యారు. మిగిలిన రెండు వికెట్లు తీసేందుకు భారత్‌కు ఎక్కువ సమయం పట్టలేదు. 39 బంతుల వ్యవధిలో పాక్ చివరి 9 వికెట్లు చేజార్చుకుంది!

### కీలక భాగస్వామ్యాలు...

ఛేదనలో భారత్ ఆరంభంలో తడబడింది. అద్భుత ఫామ్‌లో ఉన్న అభిషేక్ శర్మ (5)ను నిలువరిచడంలో పాక్ సఫలం కాగా... కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (1), శుబ్‌మన్ గిల్ (12) కూడా విఫలమయ్యారు. దాంతో స్కోరు 20/3కి చేరింది. ఈ దశలో తిలక్, సామ్సన్ కలిసి జట్టును ఆదుకున్నారు. వీరిద్దరు చక్కటి షాట్లతో ఇన్నింగ్స్‌ను నడిపించారు. నాలుగో వికెట్‌కు 50 బంతుల్లో 57 పరుగులు జత చేసిన అనంతరం సామ్సన్ వెనుదిరిగాడు. అయితే తిలక్, దూబే భాగస్వామ్యంలో జట్టు గెలుపు దిశగా పయనించింది. వీరిద్దరు 40 బంతుల్లోనే 60 పరుగులు జోడించడంతో జట్టు విజయం దాదాపుగా ఖాయమైంది. విజయానికి 10 పరుగుల దూరంలో దూబే అవుటైనా... తిలక్, రింకూ సింగ్ (4 నాటౌట్) కలిసి మ్యాచ్‌ను ముగించారు.

### బుమ్రా అలా...

భారత్‌తో గత మ్యాచ్‌లో పాక్ బౌలర్ రవూఫ్ యుద్ధంలో భారత విమానాలు నేలకూలినట్లుగా సైగలు చేస్తూ తమ దుర్బుద్ధిని ప్రదర్శించాడు. దీనిపై అతనికి ఐసీసీ జరిమానా కూడా విధించింది. ఫైనల్లో చక్కటి బంతితో రవూఫ్‌ను బుమ్రా బౌల్డ్ చేశాడు. వెంటనే బుమ్రా కూడా అదే తరహాలో విమానం నేలను ఢీకొట్టినట్లుగా సైగ చేస్తూ రవూఫ్‌ను సాగనంపడంతో స్టేడియం హోరెత్తిపోయింది.

### రూ. 21 కోట్ల నజరానా

ఆసియా కప్ గెలిచిన టీమిండియాకు బీసీసీఐ భారీ ప్రోత్సాహకం ప్రకటించింది. జట్టు సభ్యులతో పాటు సహాయ సిబ్బందికి కలిపి రూ. 21 కోట్ల నజరానా ఇస్తున్నట్లు పేర్కొంది. '3 దెబ్బలు, 0 స్పందన, ఆసియా కప్ చాంపియన్స్, కావాల్సిన సందేశం అందించాం' అని బీసీసీఐ ట్వీట్ చేసింది.

### ట్రోఫీని స్వీకరించని భారత జట్టు

దుబాయ్: ఆసియా కప్ ఫైనల్ తర్వాత అనూహ్యం చోటు చేసుకుంది. మ్యాచ్ ముగిసి గంట సమయం దాటినా బహుమతి ప్రదానోత్సవం జరగలేదు. దాంతో ఏం జరిగిందనే అంశంపై చర్చ మొదలైంది. భారత జట్టు విజేత ట్రోఫీని స్వీకరించే విషయంలో వివాదం నెలకొనడమే అందుకు కారణమని తేలింది. ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు, పాకిస్తాన్ క్రికెట్ బోర్డు చైర్మన్ అయిన మొహసిన్ నఖ్వీ చేతుల మీదుగా కప్‌ను అందుకునేది లేదని టీమిండియా స్పష్టం చేసింది. చివరకు నఖ్వీ నుంచి మాత్రమే కాదు...తాము అసలు ట్రోఫీని తీసుకునేది లేదని సమాచారం ఇచ్చింది. దాంతో నిర్వాహకులు ట్రోఫీ ప్రదానోత్సవం లేకుండానే కార్యక్రమాన్ని ముగించారు. తిలక్, దూబే, అభిషేక్ మాత్రం తమ వ్యక్తిగత బహుమతులు అందుకున్నారు.

# ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తును ఆపుతావా?

**కృష్ణానదిపై కర్ణాటక కుట్రను నిలువరించే దమ్ముందా?**

**నల్లమల పులిగా చెప్పుకునే సీఎం రేవంత్ రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలి**

**రాహుల్‌గాంధీ తనను ఎప్పుడు తీసేస్తాడోనన్న భయంలో ఉన్నాడు**

**ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కాదు.. కాంగ్రెస్, బీజేపీ జాయింట్ వెంచర్ ప్రభుత్వం**

**సీఎం సొంత గడ్డ నుంచే స్థానిక ఎన్నికల శంఖారావం**

**అచ్చంపేటలో బీఆర్ఎస్ జనగర్జన బహిరంగ సభలో కేటీఆర్**



నాగర్‌కర్నూల్: కృష్ణానదిపై ఉన్న ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచేందుకు కర్ణాటక ప్రభుత్వం కుట్ర చేస్తోందని, నల్లమల పులిగా చెప్పుకునే సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే ఆల్మట్టి పనులు ఆపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో బీఆర్ఎస్ రోడ్‌షో నిర్వహించిన అనంతరం జరిగిన జనగర్జన బహిరంగసభలో మాట్లాడారు. ఆల్మట్టి నిర్మాణంపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నాటి నుంచే పోరాటం సాగిందన్నారు. ఇప్పుడు కర్ణాటక ప్రభుత్వం రూ.70వేల కోట్లతో ఆల్మట్టి ఎత్తును 5 మీటర్లు పెంచేందుకు నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఇదే జరిగితే కృష్ణానది నుంచి పాలమూరుకు ఒక్క చుక్కనీరు కూడా రాదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఒప్పించి పనులు ఆపాలని కోరారు. నల్లమల పులిగా గర్జిస్తారా? లేక పిల్లిలా ఇంట్లో కూర్చుంటారా? సీఎం రేవంత్ తేల్చుకోవాలన్నారు. అప్పుడే ఆయన నల్లమల పులో లేక నక్కో తేలుతుందని చెప్పారు. రాహుల్‌గాంధీ తనను సీఎం పదవి నుంచి ఎప్పుడు తీసేస్తాడోనన్న భయంతో రేవంత్ గడుపుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కింద చేపట్టిన నార్లాపూర్, ఏదుల, వట్టెం, కర్వెన, ఉద్దండాపూర్ రిజర్వాయర్లు పూర్తయ్యాయని కేటీఆర్ చెప్పారు. ప్రాజెక్టు పనులు 90 శాతం పూర్తి కాగా, మిగిలిన 10 శాతం పనులను సీఎం రేవంత్ రెండేళ్లు గడిచినా పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు పేరు వస్తుందనే ఈ ప్రాజెక్టును ముట్టుకోవడం లేదన్నారు. గతంలో ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్సార్, రోశయ్య, కిరణ్‌కుమ్మర్‌రెడ్డి, కేసీఆర్ వంటి నాయకులు ముఖ్యమంత్రులుగా పనిచేసినా ఏనాడూ సీఎం రేవంత్ తరహాలో హీనంగా మాట్లాడలేదని కేటీఆర్ చెప్పారు. గుడ్లతో గోటీలాడుతా.. పేగులు తీసి మెడలో వేసుకుంటానంటూ గలీజు మాటలు మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. రాష్ట్రం దివాలా తీసిందని, కేన్సర్ పేషెంట్‌లా ఉందంటూ, తనను కోసినా రూపాయి రాదంటూ మాట్లాడటం ఆయన చిల్లర బుద్ధికి నిదర్శనమన్నారు. అచ్చంపేటలో ఎమ్మెల్యే ఓడినా కేసీఆర్ గెలుస్తారని ఇక్కడి ప్రజలు అనుకున్నారని, రాష్ట్రమంతా ఇలాగే అనుకునే మోసపోయారని కేటీఆర్ చెప్పారు. రానున్న స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలన్నారు. గత ఏడాది మంత్రి పొంగులేటి ఇంట్లో ఈడీ దాడులు చేసి నోట్ల కట్టలు దొరికాయని వార్తలు వచ్చాయని, ఇప్పుడు ఈడీ, మంత్రి ఎవరూ నోరు విప్పడం లేదని చెప్పారు. దీనిని బట్టే కాంగ్రెస్, బీజేపీ రెండూ ఒక్కటేనని తెలుస్తోందన్నారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వం కాదని.. కాంగ్రెస్, బీజేపీ జాయింట్ వెంచర్ ప్రభుత్వమని వ్యాఖ్యానించారు. సభలో ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్ధన్‌రెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, ఆల వెంకటేశ్వరరెడ్డి, జైపాల్‌యాదవ్, పట్నం నరేందర్‌రెడ్డితోపాటు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

# చెరువుల్ని చెరబడితే తాటతీస్తాం

నాకు మంచి మిత్రుడు. ఖాళీ చేయమని చెప్పినా వినకపోవడంతో మా అధికారులు దానిని కూల్చేశారు. ఇప్పుడు ఆయనే ముందుకు వచ్చి రెండు ఎకరాలు అప్పగించారు. ఎవరైనా తక్కు వ రేటుకు ఇస్తున్నామని ప్రభుత్వ స్థలాలను అమ్మితే తీసుకోవద్దు. మూసీ నిర్వాసితులకు శాశ్వత ఇళ్లను నిర్మించి ఇస్తాం. ప్రగతి భవన్‌కు జ్యోతిరావు పూలే పేరు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వీహెచ్ సలహాలతో చేసినవే'అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు బతుకమ్మ కుంటకు పునరుజ్జీవం కల్పించడం ఆరంభం మాత్రమేనని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. చెరువు చుట్టూ ఉన్న పేదల ఇళ్లను కూల్చకుండానే చెరువును అభివృద్ధి చేశామని వివరించారు. అంబర్‌పేట నియోజకవర్గానికి రెండుసార్లు ప్రాతినిధ్యం వహించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి.. ఇక్కడ చేసిన అభివృద్ధి ఏమీ లేదని కాంగ్రెస్ నేత వి. హనుమంతరావు విమర్శించారు.

# 1న బంగాళాఖాతంలో అల్పపీడనం

**మరోవైపు ఈశాన్య అరేబియన్ సముద్రంలోనూ అల్పపీడనం ఏర్పడే అవకాశం**

**దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మూడురోజుల పాటు వర్షాలు**

హైదరాబాద్: ఉత్తర బంగాళాఖాతం, దానికి సమీపంలోని మధ్య బంగాళాఖాతంలో అక్టోబర్ 1వ తేదీన ఒక అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం ఉత్తర అండమాన్ సముద్ర ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. మంగళవారం నాటికి అదే ప్రాంతంలో ఉపరితల చక్రవాత ఆవర్తనం ఏర్పడుతుందని, ఆ తర్వాత ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనంగా మారుతుందని వాతావరణ శాఖ వివరించింది. ఉత్తర, మధ్య మహారాష్ట్ర, దక్షిణ గుజరాత్, సౌరాష్ట్ర ప్రాంతంలో అల్పపీడనం కొనసాగుతోందని, మంగళవారం నాటికి ఈశాన్యం అరేబియన్ సముద్ర ప్రాంతంలో మరో అల్పపీడనంగా ఏర్పడే అవకాశముందని వాతావరణ శాఖ తెలిపింది. ఉపరితల ద్రోణి ఒకటి పశ్చిమ విదర్భ, దాని సమీపంలోని మధ్య మహారాష్ట్ర ప్రాంతంలోని అల్పపీడన కేంద్రం నుంచి దక్షిణ ఛత్తీస్‌గఢ్, ఉత్తర కోస్తా ఆంధ్రా నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు కొనసాగుతోందని, ఇది సముద్ర మట్టం నుంచి సగటున 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉందని వివరించింది. దీని ప్రభావంతో రానున్న మూడు రోజులు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు వాతావరణ శాఖ వివరించింది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయి.

### రెండ్రోజుల్లో ముగియనున్న నైరుతి సీజన్

నైరుతి రుతు పవనాల సీజన్ మరో రెండు రోజుల్లో ముగియనుంది. జూన్1వ తేదీ నుంచి సెప్టెంబర్ 30 వరకున్న మధ్య కాలాన్ని నైరుతి రుతు పవనాల సీజన్‌గా పరిగణిస్తారు. ప్రస్తుతం నైరుతి రుతు పవనాల ఉపసంహరణ ప్రక్రియ వేగంగా సాగుతోంది. ఇప్పటికే పలు ఉత్తరాది రాష్ట్రాల నుంచి నైరుతి రుతు పవనాల ఉపసంహరణ పూర్తి కాగా, వచ్చేనెల రెండో వారం చివరి నాటికి భారత భూభాగం నుంచి పూర్తిగా తిరోగమిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఈసారి నైరుతి రుతు పవనాల సీజన్‌లో వర్షాలు సమృద్ధిగా కురిశాయి. తొలి అర్ధభాగం తీవ్ర వర్షాభావ పరిస్థితులు నమోదైనా, ఆ తర్వాత రుతు పవనాల కదలికలు అత్యంత చురుగ్గా ఉండడంతో వానలు జోరందుకున్నాయి. నైరుతి సీజన్‌లో రాష్ట్రంలో సగటున 74.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటికే 98.48 సెంటీమీటర్ల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే దాదాపు 35 శాతం అధిక వర్షపాతం నమోదైంది. మరో రెండు రోజుల్లో రాష్ట్రంలో కురిసే వర్షాలతో సీజన్ వర్షపాతం 100 సెంటీమీటర్లు దాటే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సీజన్‌లో రాష్ట్రంలోని ఏడు జిల్లాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, 18 జిల్లాల్లో అధిక వర్షపాతం, ఏడు జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా పరిశీలిస్తే... 147 మండలాల్లో అత్యధిక వర్షపాతం, 291 మండలాల్లో అధిక వర్షపాతం, 181 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. 2 మండలాల్లో లోటు వర్షపాతం ఉన్నట్టు వాతావరణ శాఖ వెల్లడించింది.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు పరిశీలకులను నియమించిన కేంద్ర ఎన్నికల సంఘం

హైదరాబాద్: తెలంగాణలో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో జరగనున్న ఉపఎన్నిక పర్యవేక్షణ కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఆదివారం కేంద్ర పరిశీలకులను నియమించింది. దేశవ్యాప్తంగా బిహార్ అసెంబ్లీ ఎన్నికలు, ఎనిమిది రాష్ట్రాల్లో ఉపఎన్నికల కోసం మొత్తం 470 మంది సీనియర్ అధికారులను నియమించినట్టు కమిషన్ ప్రకటి ంచింది. ఈ పరిశీలకుల్లో 320 మంది ఐఏఎస్, 60 మంది ఐపీఎస్, 90 మంది ఐఆర్ఎస్, ఐఆర్ఏఎస్,ఐసీఏఎస్ తదితర సేవలకు చెందినవారని కమిషన్ వివరించింది. వీరు ఎన్నికల ప్రక్రియలో న్యాయం, పారదర్శకత, విశ్వసనీయతను నిర్ధారించడమే లక్ష్యం గా పర్యవేక్షిస్తారు. ఎన్నికల సమయంలో చట్టం, శాంతిభద్రతల పరిస్థితిని పరిశీలిం చేందుకు జనరల్, పోలీసు పరిశీలకులు వ్యవహరించగా, అభ్యర్థులు ఖర్చు చేసే ఎన్నికల వ్యయాన్ని గమనించేందుకు ఎక్స్పెండిచర్ పరిశీలకులను నియమించామని కమిషన్ తెలిపింది. కేంద్ర పరిశీలకులు ఎన్నికల సంఘానికి "కళ్ళు- చెవులు"గా వ్యవహరిస్తారని, సమయానుకూలంగా నివేదికలు పంపుతారని కమిషన్ పేర్కొంది. ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షణతో పాటు ఓటర్ల అవగాహన, పాల్గొనటానికి కూడా వారు సహకరించనున్నారు. జమ్మూ కశ్మీర్ (బద్గామ్, నాగ్రోటా), రాజస్థాన్ (అంటా), ఝూర?ండ్ (ఘాట్శిలా), పంజాబ్ (తర్న్ తారన్), మిజోరాం (డంపా), ఒడిశా (నుఅపాడా)లో జరగనున్న ఉపఎన్నికల్లో కూడా ఈ పరిశీలకులను నియమించినట్టు కమిషన్ ప్రకటించింది.

# కాల్పుల విరమణ కుదరదు

సంబంధం లేదని సూచించారు. ఇటీవలి కాలంలో మావోయిస్టుల పేరుతో రకరకాల లేఖలు విడుదల చేస్తూ ప్రజలను గందరగోళ పరుస్తున్నారని ఆక్షేపించారు. కాల్పుల విరమణతో సంబంధం లేకుండా లొంగిపోవచ్చని పేర్కొన్నారు. లొంగిపోయే మావోయిస్టులకు రెడ్ కార్పెట్‌తో స్వాగతం పలుకుతామని, ఆకర్షణీయమైన పునరావాస ప్యాకేజీ ఇస్తామని వెల్లడించారు. దేశంలో వామపక్ష తీవ్రవాదానికి కమ్యూనిస్టు పార్టీలు సైద్ధాంతిక మద్దతు ఇస్తున్నాయని అమిత్ షా ఆరోపించారు. ప్రభుత్వాలు దేశ అభివృద్ధిపై దృష్టి పెట్టకపోవడం వల్లే మావోయిస్టులు పుట్టుకొస్తున్నారంటూ కమ్యూనిస్టులు చేస్తున్న వాదనను ఖండించారు. నిజానికి మావోయిస్టుల హింసాకాండ కారణంగానే అభివృద్ధి ఫలాలు దేశంలో కొన్ని ప్రాంతాలకు దశాబ్దాలుగా చేరడం లేదని ఆరోపించారు. అభివృద్ధిని రెడ్ టెర్రర్ అడ్డుకుంటోందని మండిపడ్డారు. నక్సలైట్లు హత్యలు చేయకుండా, హింసకు పాల్పడకుండా కఠిన చర్యలు తీసుకుంటే నక్సలిజం అంతమవుతుందని కొందరు చెబుతున్నారని, అందులో ఎంతమాత్రం వాస్తవం లేదని ఉద్ఘాటించారు. సమాజంలోని వ్యక్తులు తెరపైకి తీసుకొచ్చిన సిద్ధాంతం వల్లనే నక్సలిజం పెరిగిందని గుర్తుచేశారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ నాటికి నక్సలిజం నుంచి దేశానికి విముక్తి కల్పిస్తామని అమిత్ షా ప్రకటించారు. ఆయుధాలతో అడవుల్లో సంచరిస్తున్న వ్యక్తులకు గిరిజనుల బతుకుల గురించి ఎలాంటి పట్టింపు లేదని ఆక్షేపించారు. దేశ ప్రజలు ఇప్పటికే తిరస్కరించిన వామపక్ష సిద్ధాంతాన్ని బతికించుకోవడానికి మావోయిస్టులు ఆరాటపడుతున్నారని ఎద్దేవా చేశారు. నక్సల్స్ వ్యతిరేక ఆపరేషన్‌ను వెంటనే ఆపాలంటూ సీపీఐ, సీపీఎం లేఖలు రాయడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. నక్సల్స్ బాధితుల హక్కుల గురించి వీరు ఎందుకు మాట్లాడడం లేదని మండిపడ్డారు. 1960వ దశకం నుంచి వామపక్ష తీవ్రవాదం వల్ల ప్రాణాలు కోల్పోయినవారికి అమిత్ షా నివాళులర్పించారు. పశుపతినాథ్ నుంచి తిరుపతి దాకా అంటూ నక్సలైట్లు జపం చేస్తున్నారని, అది చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని చెప్పారు. జమ్మూకశ్మీర్‌ను కాపాడాలన్న లక్ష్యంతో ఆర్టికల్ 370ని రద్దుచేశామని, ఆ తర్వాత అక్కడ భద్రతా సిబ్బంది మరణాలు 65 శాతం, సాధారణ పౌరుల మరణాలు 77 శాతం తగ్గిపోయాయని అమిత్ షా స్పష్టంచేశారు.



# ఆటో యూనియన్‌కి మద్దతుగా మారబోయిన రవి యాదవ్

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :శేరిలింగంపల్లిలోఎచ్ సి యూ డిపో ఎదురగా ఉన్న ఆటో యూనియన్ కార్మికులు బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తూ మారబోయిన రవి యాదవ్ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ లోని ఆటోలన్నిటికీ దసరా పండుగ పోస్టర్ ను మారబోయిన రవి యాదవ్ చేతుల మీదుగా అతికించి దసరా పండగ పోస్టర్ను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు మారబోయిన రవి యాదవ్ మాట్లాడుతూ ఈ ప్రభుత్వం ఆటో కార్మికులకు పథకాలు ఇస్తామని చెప్పి ఇవ్వకుండా ఆటో కార్మికులను మోసం చేస్తుంది, కావున ఆటో కార్మికులందరికీ న్యాయం చేయడానికి, వారి యొక్క కష్టసుఖాలను బిఆర్ఎస్ నాయకత్వం ముందుండి చూస్తుందని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ లీడర్ వేముల మారన్న, పరశురాముడు యాదవ్, సజుభాయ్, సైదులు, ఎల్ల స్వామి, శామప్ప, కే.ఎన్.రాములు, ప్రభాకర్ గౌడ్, గడ్డం శ్రీనివాస్, శంకర్, కొండకల్ శ్రీనివాస్, మల్లేష్ ముదిరాజ్, బీఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## దేవీ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి: మధుసూదన్ రెడ్డి

వార్త మిర్రర్, మల్కాజిగిరి:దేవి నవరాత్రి ఉత్సవాల వలన ప్రజలలో భక్తి భావం పెంపొందుతుందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు మధుసూదన్ రెడ్డి పేర్కొన్నారు. నేరేడ్మెట్ డివిజన్ పరిధిలోని మధురానగర్ పార్కులో మధుర నగర్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మల్కాజ్గిరి ప్రెస్ క్లబ్ గౌరవాధ్యక్షుడు బద్దుల మురళి కృష్ణ యాదవ్, అనంత్ యాదవ్,పవన్ కుమార్, కార్తీక్,అశోక్,రాజేష్ చారి లు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా మధు రెడ్డి మాట్లాడుతూ అమ్మవారి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని అన్నారు. అమ్మవారి అనుగ్రహంతో ప్రతి ఒక్కరు తమ తమ రంగంలో రాణించాలని కోరుకున్నారు. నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



## అల్లీపూర్ లో అంగరంగ వైభవంగా కుంకుమ పూజ

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 28 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ లోని నవదుర్గ సేవ సమితి పోచమ్మ వాడ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం రోజున దుర్గా మాత మహా చండి రూపం లో దర్శనమిచ్చిన అమ్మవారు నక్షత్ర హారతిలో అమ్మవారి యొక్క ప్రతిరూపంలో జగన్మాత దర్శనమిచ్చారు అమ్మవారి సన్నిధిలో ఆదివారం రోజున కుంకుమ పూజ అంగరంగ వైభవంగా నిర్వహించారు. పురోహితులు అంగడి పరమేశ్వర్ ఆధ్వర్యంలో కుంకుమ పూజ నిర్వహించి భక్తులకి కుంకుమ పూజ విశిష్టత గూర్చి తెలిపారు. పూజా విధానాల ప్రాముఖ్యతను వివరించి, భక్తులను భక్తి శ్రద్ధలతో పాల్గొనాలని సూచించారు. సుమారు 80 మంది మాతలచే సామూహిక కుంకుమ పూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నవదుర్గ సేవాసమితి పోచమ్మ వాడ కమిటీ సభ్యులు, భవాని దీక్ష పరులు, మాతలు, మరియు భక్తులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## కేంద్రమంత్రిని కలిసిన పద్మశాలి సంఘ సభ్యులు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 28జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కిష్టంపేట పద్మశాలి సేవా సంఘం సభ్యులు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ కుమార్ ని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది.

# శ్రీ దేవి నవరాత్రోత్సవాలలో భాగంగా నేడు పుల్లెంల గ్రామంలో శ్రీ మహాచండీ దేవి హోమం ...

### నేడు 7 వ రోజు శ్రీ మహాచండీ దేవి అవతారంలో దర్శనం ఇచ్చిన అమ్మవారు...



నల్గొండ జిల్లా వార్త మిర్రర్ ప్రతినిధి...ఆది వారం రోజు చండూరు మండలం లోని పుల్లెంల గ్రామంలోని రామాలయం దగ్గర ఏర్పాటు చేసిన అమ్మవారి పూజా కార్యక్రమంలో భాగంగా నేడు 7వ రోజు శ్రీ మహాచండీ దేవి అవతారంలో అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన పిన్నింటి వెంకట్ రెడ్డి-మంజుల దంపతులు, కొడతం కిరణ్ కుమార్ రెడ్డి-ప్రణతి దంపతులు,పిన్నింటి బిక్షం రెడ్డి-చంద్రకళ దంపతులు, కొత్త మోహన్ రెడ్డి-పద్మమ్మ దంపతులు దుర్గామాతకు చేసే “దుర్గా హోమం” అనేది దుర్గాదేవిని పూజించి,దైవిక బలం,రక్షణ మరియు ధైర్యం పొందడం కోసం చేసే ఒక పవిత్రమైన వైదిక ఆచారం.ఈ హోమం ప్రతికూల శక్తులు,ఆటంకాలు,మరియు చెడు దృష్టి వంటి వాటి నుండి రక్షణ కల్పిస్తుందని నమ్ముతారు.ఇది జీవితంలో సామరస్యాన్ని,సంతృప్తిని, మరియు సవాళ్లను అధిగమించే శక్తిని ఇస్తుంది.దుర్గామాత యొక్క శక్తిని ఆరాధించడం ద్వారా శారీరక మరియు మానసిక బలాన్ని,ధైర్యాన్ని పెంపొందిస్తుంది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ మాజీ సర్పంచ్ బొబ్బల సంధ్యారాణి- మనోహర్ రెడ్డి ,పిన్నింటి నరేందర్ రెడ్డి ,గోపిడి నర్సి రెడ్డి ,ముక్కాముల రాజు , గుండెబోయిన దిలీప్ ,జాజుల రవి ,బొబ్బల జనార్దన్ రెడ్డి ,చెరుకు లింగయ్య బద్దం అంజి రెడ్డి , మందడి రాం రెడ్డి ,కిరణ్ ,విష్ణు మరియు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయంవంతం చేశారు.

# దేశభక్తి, హిందూ సంఘటనతోనే దేశరక్షణ సాధ్యం

### దేశంలో దైవ భక్తికి కొరత లేదు దేశభక్తి అవసరం...
### సమాజ సర్వాంగీణ వికాసమే ఆర్.ఎస్.ఎస్ ధ్యేయం...
### శత జయంతి ఉత్సవాలు, పథసంచలనం లో ఆర్.ఎస్.ఎస్ వక్తల ఉద్ఘాటన...

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 28 : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ రాయికల్ నగర శాఖ, మహితాపూర్, భూపతిపూర్ గ్రామ శాఖల ఆధ్వర్యంలో శతజయంతి సందర్భంగా ఆదివారం ఘనంగా విజయదశమి ఉత్సవాలు నిర్వహించారు. విశేషంగా మహితాపూర్ 145 మంది గణవేషధారి స్వయం సేవకులతో గ్రామ వీదుల్లో పథసంచలనం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయికల్ లో ప్రాంత సహవ్యవస్థా ప్రముఖ్ ఘంటా తిర్మల్ జీ, మహితాపూర్ లో జిల్లా కార్యవాహ్ గొల్కొండ నాగరాజు, భూపతిపూర్ లో గుంటుకుల రమేష్ లు మాట్లాడుతూ దేశభక్తి హిందూ సంఘటన తోనే దేశ రక్షణ సాధ్యం అవుతుందని, దేశంలో ప్రస్తుతం దైవ భక్తికి కొరత లేదని, దేశాన్ని కాపాడుకోవాలంటే దేశభక్తి అవసరమని అన్నారు. హిందువులందరు ఐక్యంగా ఉండి పార్టీలకు అతీతంగా సనాతన ధర్మ పరిరక్షణకు పాటుపడాలనీ, ఆర్.ఎస్.ఎస్ లేకుంటే ప్రస్తుతం మనము మన దేశమే లేదని, సంఘం దేశంలో ఎన్నో సేవా కార్య క్రమాలు చేస్తోందని అన్నారు. నేడు దేశంలో జరుగుచున్న లవ్ జిహాద్ లోనుండి మన ఆడపడుచులను రక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని, అనాదిగా వస్తున్న మన కట్టు బొట్టు ఆచారా వ్యవహారాలను మన కుటుంబంలో ఆచరిస్తూ ఆచరింప జేయాలని అన్నారు. సంఘం నిత్య శాఖల ద్వారా జాతీయ భావాలు కలిగిన దేశభక్తులను తయారు చేస్తుందని, అటువంటి మహోన్నత జాతీయవాద వ్యక్తుల ద్వారా, దేశభక్తి కలిగిన పరిపాలకుల ద్వారా దేశం అతిపెద్ద మూడవ ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా నిర్మితమౌతుందనీ, విశ్వగురు స్థానం వైపు అడుగులు వేస్తుందని, దేశ పరమవైభవ స్థితి సాధనే ధ్యేయమని అన్నారు. ముఖ్యంగా కరోనా సమయంలో కార్యకర్తలు ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేసి ఆహారం, మందులు పంపిణీ చేసి వేలాది ప్రాణాలను కాపాడారని గుర్తుచేశారు. వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సంఘం పలు రకాల విభాగాలతో సేవా భావంతో



ప్రజలలో దాతృత్వాన్ని పెంపొందిస్తోందని అన్నారు. దేశంలో సమాజ పరివర్తన అనేది వ్యక్తి పరివర్తన ద్వారానే సాధ్యమని, ఆ పరివర్తనకు “పంచ పరివర్తన’ కీలకమని అన్నారు. స్వదేశీ, పర్యావరణ రక్షణ, కుటుంబ వ్యవస్థ బలోపేతం, సామాజిక సామరసత, పౌర విధుల ఆచరణ ఈ ఐదు అంశాలు సమాజ మార్పుకు పునాది రాళ్లు అవుతాయని చెప్పారు. అసురుల మీద దైవ శక్తి విజయం సాధించిన సందర్భమే విజయదశమి అని, చరిత్రలో ఎప్పుడైతే అధర్మం విస్తరిస్తుందో అప్పుడు మహానుభావులు అవతరిస్తారని, అదే క్రమంలో 1925 లో డాక్టర్ హెడ్గేవార్ ఆర్.ఎస్.ఎస్ స్థాపన చేసి దేశంలో ధర్మ ప్రతిష్టాపనకు నాంది పలికారని వివరించారు. అలాగే ఆర్.ఎస్.ఎస్ స్వయం సేవకులు సమా జాన్ని సంఘటితం చేసి 500 వందల ఏళ్ల పోరాటం తర్వాత అయోధ్యలో భవ్యమైన శ్రీరామ మందిరం నిర్మాణాన్ని సాధ్యంచేశారని, తిరుమల తిరుపతి పరిరక్షణ సమితి ద్వారా మత మార్పిడి ప్రయత్నాలను అడ్డుకున్నారని, కాశ్మీర్లో 370వ ఆర్టికల్ రద్దుకు దోహదం చేశారని ఆయన గుర్తు చేశారు. సేవా, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ఆర్.ఎస్.ఎస్ ప్రపంచంలోనే అతి పెద్ద స్వచ్ఛంద సంస్థ (ఎన్జీవో)గా నిలిచిందని చెప్పారు. మన పిల్లలకు చిన్నతనం నుండే మనం సాంస్కృతి సాంప్రదాయాలు నేర్పుతూ ఆచరింపజేయించాలనీ అన్నారు. రాయికల్ లో 351 మంది, మహితాపూర్ లో 315 మందిలో విశేషంగా మహిళలు 120 మంది, భూపతి పూర్ లో 75 మంది స్వయం సేవకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది

### ముఖ్యమంత్రి తో కలిసి జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి కి నిరంతరం కృషి చేస్తా
### రాయికల్ మండలంలో 6 కోట్ల 30 లక్షలతో బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు
### జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 28 : జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కిష్టంపెట్ గ్రామంలో కిష్టంపేట నుండి చల్గల్ వరకు 1కోటి 56 లక్షలతో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్. రాయికల్ మండలం అల్లీపూర్ గ్రామంలో అల్లీపూర్ నుండి ఎల్లమ్మ గుడి మీదుగా శ్రీరాంనగర్ వరకు 1కోటి 56లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చెర్ల కొండాపూర్ గ్రామంలో చేర్లకొండాపూర్ నుండి మైతాపూర్ వరకు 1 కోటి 86 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన. ఇటిక్యాలలో- ఆర్ అండ్ బి రోడ్డు నుండి మోడల్ స్కూల్ వరకు 64 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన. చింతలూరు గ్రామం ఆర్ అండ్ బి రోడ్డు నుండి బషీర్పల్లి వరకు 68 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్. చింతలూరు గ్రామానికి చెందిన ముంజం భాగ్య లక్ష్మీ కి, దరావత్ సునీత ప్రభాకర్ కి మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి తో కలిసి జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధి కి నిరంతరం కృషి చేస్తా .. రాష్ట్రంలోనే అత్యధిక ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు, ఈ జి ఎస్ నిధులు జగిత్యాల కు మంజూరు చేయటం జరిగింది. అత్యధిక పల్లె దవాఖానలు జగిత్యాల కు మంజూరు చేయటం జరిగింది. అల్లీపూర్ గ్రామాన్నీ మండలం చేయాలని ప్రజల ఆకాంక్ష అని, ముఖ్యమంత్రి దృష్టికి మండలం విషయం తీసుకెళ్లడం జరిగింది అని తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. అడ్వాన్స్ టెక్నికల్ సెంటర్ తో యువతకు వృత్తి నైపుణ్యాలను మెరుగు పరచడం, ఉపాధి అవకాశాలు లభించేలా ప్రభుత్వం కృషి చేస్తుంది. బి ఫాం ఇచ్చే అవకాశం వస్తే జగిత్యాల నియోజకవర్గం లో బీసీ లకు 42 శాతం ,ఎస్సీ ఎస్టీ లకు మొత్తంగా 69



శాతం సీట్లు కేటాయిస్తా...గతంలోనే అత్యదిక స్థానాలు బీసీ ఎస్సీ ఎస్టీ లకు కేటాయించడం జరిగింది అని గుర్తు చేశారు. బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది. అతి త్వరలోనే స్తానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తారు. యూరియా విషయంలో కావాలని రాజకీయం చేస్తున్నారని, రైతులు గమనించాలి. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చిరంజీవి, ఎంపీవో సుష్మ, డా. మిలింద్,ఏ ఈ ప్రసాద్, పాక్స్ చైర్మన్ లు ఏనుగు మల్లారెడ్డి, ధీటి రాజీ రెడ్డి, రాజలింగం, మాజీ మున్సిపల్ చైర్మన్ మోర హనుమండ్లు,గన్నే రాజీరెడ్డి,అచ్యుత రావు,కోల శ్రీనివాస్,పడిగేల రవీందర్ రెడ్డి, కాటిపెల్లి గంగారెడ్డి, భేతి మోహన్,ముఖీద్, జోగినిపెల్లి తిరుపతి గౌడ్, శ్రీనివాస్, గౌడ్, శ్రీనివాస్, వేణు, అనుపురం శ్రీనివాస్,సిరిపురం సత్తయ్య, రత్నాకర్రావు,సతీష్,రాజమౌళి,శ్రీరామ్, బొంతల ఆదిరెడ్డి, గడ్డం గంగారెడ్డి, రవి గౌడ్,అల్లకొండ సుదర్శన్, సాయి రెడ్డి,దేవుని రవి, గంగారెడ్డి, బాపు రావు నాయక్,రాజు,రాజేశం, రవి,భూమన్న,ప్రభాకర్ నాయక్,రమేష్ నాయక్, శేఖర్ గౌడ్, శ్రీనివాస్, లక్ష్మి నారాయణ, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని ఎల్బీనగర్‌లో మంత్రి శ్రీధర్‌బాబు, ఎం .ఎల్. సి ఎల్ రమణ తో కలిసి ఆవిష్కరించిన ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్ వార్త మిర్రర్ ప్రతినిధి ఎల్బీ నగర్ లో కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహాన్ని మంత్రి శ్రీధర్ బాబు,ఎం ఎల్ సి ఎల్ రమణ తో కలిసి ఎం పీ ఈటల రాజేందర్ ఆవి ష్కరించారు.ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ 1941 లో గాంధీజీ ని కలిసి క్విట్ ఇం డియా ఉద్యమంలో పాల్గొన్నారు. 1947-48 లో నిజాంకి వ్యతిరేకంగా గెరిల్లా పోరాటంలో తుపాకీ పట్టిన బాపూజీ అని అన్నారు.ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్, మంత్రి పదవి ఎన్ని పదవులు నిర్వహించినా ఆయన ఆరాటం తెలంగాణ గురించే. ఉద్యమంలో యువకులు చనిపోయిన ప్పుడు తెలంగాణ వచ్చే వరకు ఏ పదవి అధిష్టించనని జీవితాంతం పోరాడారు అని ఆయన అన్నారు. నేను చిన్న పిల్లగాడిగా ఉన్నప్పుడు బాపూజీ మా ఊరికి వచ్చారు. చేనేత శాఖ మంత్రిగా ఆ రోజుల్లోనే చేనేత కార్మికుల కోసం కృషి చేశారు. మలి దశ ఉద్యమంలో సొంత ఇంటిని ఉద్యమం కోసం ఇచ్చిన గొప్ప నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. మైనస్ డిగ్రీల చలిలో కూడా ఢిల్లీలో తెలంగాణ కోసం దీక్ష చేశారు ఆయన అలాంటి మహనీయుడి విగ్రహం పెట్టుకోవడం ఆయన ఆశయాలను భావి తరాలకు అందేలా చేయడానికే. బాపూజీ ఆశయాలను సాకారం చేసేందుకు నా వంతు కృషి చేస్తాను అని రాజేందర్ అన్నారు.విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విగ్రహ శిల్పి ఈశ్వర చారి ని సత్కరించారు మరియు తడక యాదగిరి రాసిన కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితంపై రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించారు.



# శిల్పారామం లో బతుకమ్మ సంబరాలు...

మాదాపూర్ వార్త మిర్రర్ : మాదాపూర్ లో నీ శిల్పారామం లో నవరాత్రి, బతుకమ్మ మరియు దసరా సెలెబ్రేషన్స్ అండ్ సారీస్ అఫ్ ఇండియా మేళ ను నిర్వహిస్తున్నారు. డెవలప్మెంట్ అఫ్ కమీషనర్ హ్యాండ్లూమ్స్, గవర్నమెంట్ అఫ్ ఇండియా మరియువీవెర్స్ సర్వీస్ సెంటర్ హైదరాబాద్ వారి ఆధ్వర్యం లో దాదాపుగా వంద చేనేత స్టాల్స్ ఏర్పాటుచేయడం జరిగాయి. బనారస్, చెందేరి, కోట, గుజరాతీ, ఉప్పాడ, బనారస్, కాశ్మీరీ, మొదలైన చీరలు సందర్శకులకు అందుబాటులో ఉన్నాయి. శ్రీమతి రష్మీ సచిదా నందా శిష్య బృందం భరతనాట్య ప్రదర్శన లో పుష్పాంజలి, గణపతి స్తుతి, అంబ స్తవం, దేవి కృతి మొదలైన అంశాలను ఆకాంక్ష, సాయి నేహా, సంభవి, వేదాంసీ, సిరి లు ప్రదర్శించారు. శ్రీమతి బాల త్రిపురసుందరి గారి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాహి పాహి బాలగణపతి, కామాక్షి స్తుతి, భావయామి రామలింగేశ్వరం, కామాక్షి స్వరజతి, నటరాజ స్తుతి, దేవీస్తుతి అంశాలను యజ్ఞశీక, ప్రియఃసిని సంజన, అనురిత, చైత్రహాసిని లు ప్రదర్శించారు. శిల్పారామం మహిళా సిబ్బంది బతుకమ్మ ను పేర్చి సందర్శకులతో కలిసి ఆడుకున్నారు.



## ఆదివాసి సంక్షేమ సంఘం

# రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా కురుసెంగా వేణు ఎన్నిక



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 28

ఆదివాసి తోటి సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా కురుసెంగా వేణు ఆదివాసి తోటి జాతి హక్కుల పరిరక్షణకై ఆచార సాంస్కృతిక సాంప్రదాయాల సంరక్షణకై ఆదివాసి తోటి జాతి మైదాన ప్రాంతపు రాజ్యాంగపర హక్కులను సాధించే దిశగా ఆదివాసి తోటి జాతి 18 జిల్లాల జాతి బిడ్డలు మమేకమై ఉద్యమాల ఖిల్లా వరంగల్ జిల్లా వేదికగా రాష్ట్ర కమిటీ ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణానికి చెందిన ఆదివాసి, తోటి జాతి నాయకులు కురుసంగా వేణు కి ఉద్యమానికి తగ్గ గుర్తింపు లభించి యావత్ తోటి జాతి మొత్తం మమేకమై ఏకగ్రీవంగా కార్యనిర్వాహణ అధ్యక్షుడిగా వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎంపిక చేయడం పట్ల జాతి పై తనకున్న అవగాహన, జాతి బిడ్డల అందరి ఆశీర్వాదం తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆదివాసి తోటి జాతి హక్కులను పరిరక్షిస్తానని, సాధిస్తానని కురుసంగా వేణు అన్నారు. తన ఎంపిక కృషి చేసిన 18 జిల్లాల ప్రతినిధులకు మరియు రాష్ట్ర అధ్యక్షులు ఆత్రం కమల మనోహర్ గారికి రాష్ట్ర కమిటీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.



## మొగిలి కృష్ణయ్య సగర దశదిన కర్మ కార్యక్రమంలో పాల్గొన్న మొగిలి వారి బంధుగణం.!

### కృష్ణయ్య సదర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ప్రముఖులు


యాచారం వార్త మిర్రర్ ప్రతినిధి యాచారం గాండ్ల గూడెం

నివాసి మొగిలి కృష్ణయ్య సగర దశదిన కార్యక్రమంలో పాల్గొన్న మొగిలి వారి బంధు మిత్రులు. ఈ కార్యక్రమానికి హాజరై మొగిలి కృష్ణయ్య సాగర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన. సీనియర్ అడ్వకేట్ ఆలేటి యాదగిరి సాగర్, వార్త మిర్రర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ గణేష్ సాగర్, వీర పట్నం హరిదాస్ సాగర్, కల్లెట్ల నర్సింగ్ సాగర్,గంట రాములు సాగర్, గంట శివ కుమార్ కుమార్, గంట శీను సాగర్,కాంగ్రెస్ యువజన విభాగం నాయకులు గంట సాయి సాగర్, కాంగ్రెస్ నాయకులు బోడపాడు శీను సాగర్, తల్లెట్ల పెద్దపండు సాగర్, పాండు సాగర్,ఈ కార్యక్రమంలో మొగిలి కృష్ణయ్య సాగర్ కుటుంబ సభ్యులు, మొగిలి జంగయ్య సాగర్ కుటుంబ సభ్యులు, మొగిలి లక్ష్మణ్ సాగర్ కుటుంబ సభ్యులు, తదితర బంధుమిత్రులు పాల్గొన్నారు



# మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండును పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

మిర్యాలగూడ , సెప్టెంబర్ 28:-( వార్త మిర్రర్) మిర్యాలగూడలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నుఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్ కోరడంతో ఆదివారం మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండును ఆకస్మిక తనిఖీ చేశారు. బస్టాండ్ మొత్తం తిరిగి చూశారు. బస్టాండ్ భవనం నిర్మించి 50 సంవత్సరాలు అయ్యిందని పెచ్చులు ఊడుతున్నాయని బస్టాండ్ మరమ్మత్తు పనులు చేయాలని కోరడంతో మంత్రి వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి అదేశించారు. బస్టాండ్ అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు.కార్యక్రమంలో ఎమ్మెల్సీ కె. శంకర్ నాయక్, మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్ రెడ్డి, నాయకులు మహబూబ్ అలీ, చిరుమరి కృష్ణయ్య, గుండు నరేందర్ గౌడ్, బసవయ్య గౌడ్, పొలాగని వెంకటేష్ గౌడ్, జలందరరెడ్డి, అంబటి సోమయ్య, బూడిద సైదులు, డిఎం రామోహన్ రెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# శుభప్రదం ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 28 : తెలంగాణ లోని ప్రతి పట్టణం, పల్లెల్లో జరగతున్న తొమ్మిది రోజుల బతుకమ్మ సంబరాలను పురస్కరించుకొని కాల్వపల్లి లో గల శు భప్రదం ఇంద్రప్రస్థాన్ 2 లో బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్బంగా కంపని ప్రతినిధులు, మహిళలు వివిధ రకాల పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మ ఆట,పాటలు అలరించాయి. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ సంబరాల వేడుకల నిర్వహణపై స్థానికులు శుభప్రదం ఫ్యామిలీని, ప్రతినిధులను అభినందించారు. అనంతరం బతుకమ్మను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమాల్లో సీఎండీ ఆర్ మెహనరావు, ఎం డి మధుబాబు, డైరెక్టర్లు రమేష్ బాబు, ప్రభాకర్, ఆంజనేయులు, విద్యాధర్, నాగవేంద్ర, డి ఎస్ ఆర్, స్వరూప, సరోజ, యామిని, రజిత, కవిత, విశ్వనాథ్, రతీష్, వేదప్రత్, వినోద్ రావు, సత్యనారాయణ శర్మ, శుభప్రదం ఫ్యామిలీ ప్రతినిధులు, మహిళా ప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ఘనంగా విజయ దశమి ఉత్సవం

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : సమాజ నిర్మాణంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కీలక పాత్ర పోషిస్తుంది సౌభాగ్య నంద నాద ప్రసాద్ రావు గురుస్వామి అన్నారు. ఇందులో పాలు పంచు కుంటున్న స్వయం సేవకులకు అభినందనలు తెలిపారు. మియాపూర్ దీప్తి శ్రీనగర్ అయ్యప్ప స్వామి ఆలయం, పి జె అర్ ఎంక్లైవ్ రోడ్ లో ఏర్పాటుచేసిన విజయదశమి ఉత్సవంలో సౌభాగ్య నందనాద ప్రసాద్ రావు గురుస్వామి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆదివారం ఉదయం ఆత్మీయ వాతావరణం లో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో స్వయం సేవక్ సంఘ్ సేవకులు పాల్గొన్నారు సంఘ్ కార్య శతాబ్ది ఉత్సవాలలో భాగంగా దీనిని ఏర్పాటు చేశారు పూర్తి గనవేష్( యూని ఫామ్ ) తో వచ్చిన స్వయం సేవకులతో ప్రాంగణం కలకలలాడింది ప్రజల ఐక్యత కోసం, దేశం కోసం, భరతభూమి కోసం, హిందూ ధర్మం కోసం, కుల వర్ణాలను, ఏకం చేసి ఈ దేశ ప్రజలను ఒకే గొడుగు కిందికి తీసుకువచ్చిన ఏకైక సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ 1925లో స్థాపించబడిన ఈ సంస్థ 100వ విజయదశమి ఉత్సవాలలో భాగంగా దీప్తి శ్రీనగర్ వాసులు మాతృమూర్తులు, కుటుంబ సభ్యులతో సహా తరలివచ్చారు. విజయదశమి స్ఫూర్తిని దీప్తి శ్రీనగర్ వాసులు కుటుంబంతో సహా పాలుపంచుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్త గా ఆర్ఎస్ఎస్ కూకట్ పల్లి జిల్లా కార్యవాహ అల్లాడి శ్రీనివాస్ విచ్చేశారు 1925లో మొదలైన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్



100 సంవత్సరా లుగాసమాజ నిర్మాణంలో పాలు పంచుకున్నది అని సోదాహరణంగా వివరించారు పంచ పరివర్తన ద్వారా సమాజంలో గొప్ప మార్పులు తీసుకుని రావచ్చని ఆయన సూచించారు.

# రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా గౌరు శ్రీనివాస్ వెంకటరమణచౌదరి ఏకగ్రీవం

### ఉపాధ్యక్ష, కోశాధికారి పదవులకు ఎన్నికలు.. రామ్ శేఖర్, గందె రాము ఎన్నిక

మిర్యాలగూడ , సెప్టెంబర్ 28:-( వార్త మిర్రర్)మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం 2025-27 సంవత్సరానికి స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో జరిగాయి. ఎన్నికల అధికారిగా కెఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పందిరి రవీందర్ వ్యవహరించారు. మిర్యాలగూడ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా గౌరు శ్రీనివాస్, ఒకటో కార్యదర్శిగా వెంకటరమణ చౌదరి (బాబి) రెండో కార్యదర్శిగా పోలిశెట్టి ధనుంజయ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మిల్లర్స్ ఎన్నికల్లో మొత్తం 90 ఓటర్లు. ఉపాధ్యక్ష పదవి కోసం మా శెట్టి శ్రీనివాస్, గోళ్ళ రామ శేఖర్ పోటీ పడగా జరిగిన ఎన్నికల్లో మాశెట్టి శ్రీనివాస్ కు 15 ఓట్లు, రామ్ శేఖర్ 69 ఓట్లు రాగా రామ్ శేఖర్ విజయం సాధించారు. కోశాధికారి పదవికి జరిగిన ఎన్నికల్లో చిల్లంచర్ల శ్రీనివాస్, గందె రాము పోటీపడగా శ్రీనివాస్ కు 42 ఓట్లు, రాముకు 44 ఓట్లు వచ్చాయి దీంతో రాము కోశాధికారిగా విజయం సాధించినట్లు ప్రకటించారు. 10 మంది డైరెక్టర్ల పదవి కోసం 30 నామినేషన్లు రాగా డ్రా పద్ధతిలో పది మందిని ఎంపిక చేశారు. గౌరు శంకర్, నీలా పాపారావు, పోతుగంటి కృష్ణ, మలిగిరెడ్డి మాధవరెడ్డి, రాయిని శ్రీనివాస్. కొమ్మన పట్టాభిరామ్, గుంటి గోపి, ఆతుకూరి గురునాథం, గుర్రం వెంకటరత్నం, శ్రీరంగం నర్సయ్య ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి పి.రవీందర్



ప్రకటించారు. కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్, గుడిపాటి శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు చిల్లంచర్ల విజయ్ కుమార్, మంచుకొండ వెంకటేశ్వర్లు, మున్సిపల్ మాజీ చైర్మన్ తిరునగరు భార్గవ్, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు. కొత్త పాలకవర్గంకు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. స్వీట్లు తినిపించారు.

# మూసి నదిపై కేటీఆర్ బురద రాజకీయాలు మానుకోవాలి

### రిజర్వేషన్లకు అన్ని రాజకీయ పార్టీల మద్దతు ఉంది: మంత్రి పొన్నం

మిర్యాలగూడ సెప్టెంబర్ 28:-( వార్త మిర్రర్) పదేళ్లుమున్సిపల్, పట్టణాభివృద్ధి మంత్రిగా పనిచేసిన కేటీఆర్ కు మూసీనది, నగరంపై ఎలాంటి అవగాహన లేదని రాష్ట్ర వెనుకబడిన తరగతులు సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. ఆదివారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో మూసి నది వరద గురించిప్రభుత్వపరంగా అన్ని జాగ్రత్తలు తీసుకున్న తర్వాతే ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ లోకి వికారాబాద్ మూసి నది పరివాహక ప్రాంతం నుండి భారీ వరద వచ్చి చేరడంతో మూసి నదిలోకి ఆయా ప్రాజెక్టుల నుండి నీరు విడుదల చేశారని ఆయన వివరించారు.బీఆర్ఎస్, బీజేపీలు బురద రాజకీయాలు మానుకోవాలన్నారు.అందర్నీ అప్రమత్తం చేసి 12 పునరావస కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.వేలాది మంది బాధితులను పునరావస కేంద్రాలకు క్షేమంగా తరలించామన్నారు.ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు ప్రజలు, ప్రతిపక్షాలు అన్నీ ప్రభుత్వానికి సహకరించాలన్నారు.ప్రతిపక్షాలు ప్రజల్ని తప్పుదారి పట్టించొద్దంటూ సూచన చేశారు.క్యాబినెట్, గవర్నర్ ఆమోదంతోనే 42 శాతం బీసీ రిజర్వేషన్లు జరిగిందని ఆయన వివరించారు.బీసీ రిజర్వేషన్లతో ఎస్సీ ఎస్టీలకు ఎలాంటి ఇబ్బంది లేదన్నారు, ఎవరి హక్కులు హరింప బడలేదన్నారు. రిజర్వేషన్లపై అపోహలు, అనుమానాలు తప్పుడు ప్రచారమేనన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలకు రిజర్వేషన్ ల ప్రక్రియలో ఎవరి ప్రమేయం లేదని ఆయన అన్నారు..రెండు మూడు రోజుల్లో నోటిఫికేషన్ వస్తుందని భావిస్తున్నానన్నారు.కోర్టు తీర్పుని ఎవరైనా సరే గౌరవించాల్సిందేన న్నారు.రాజ్యాంగబద్ధంగా,



చట్టబద్ధంగా రిజర్వేషన్లు అమలు చేశామన్నారు. సమావేశంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, ఎమ్మెల్సీ కె.శంకర్ నాయక్, కాంగ్రెస్ నాయకులు మహబూబ్ అలీ, చిరుమరి కృష్ణయ్య, గుండు నరేందర్ గౌడ్, బసవయ్య గౌడ్, పొలగాని వెంకటేష్ గౌడ్, అంబటి సోమయ్య, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు..

# విద్యార్థి నాయకులు మార్వాడి గో బ్యాక్ ఉద్యమంలోకి రండి:డాక్టర్ పిడమర్తి రవి

సికింద్రాబాద్, వార్త మిర్రర్ సెప్టెంబర్ 28 (సాక్ష్యం) .... తెలంగాణ రాష్ట్రాన్ని కల్తీమయం నుంచి కాపాడుకోవడానికి మార్వాడి గో బ్యాక్ ఉద్యమంలోకి విద్యార్థి నాయకులు రావాలని ఎస్సి కార్పొరేషన్ మాజీ చైర్మన్ బిఎస్ఎఫ్ వ్యవస్థాపకులు డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు బిఎస్ఎఫ్ 19వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆర్ట్స్ కాలేజ్ ఆవరణంలో బిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన జెండావిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన పిడమర్తి రవి హాజరై ప్రసంగిస్తూ విద్యార్థి నాయకులు తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎలా ముందున్నారో అదే స్ఫూర్తితో తెలంగాణను కల్తీమయం నుంచి కాపాడుకోవడానికి మార్వాడి గో బ్యాక్ గో బ్యాక్ ఉద్యమంలో క్రియ శీలకంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. హైదరాబాదు మార్వాడిలకు ఉత్తర భారత దేశ కల్తీ వ్యాపారులకు మనీ హబ్ గా మారిందని దాని అరికట్టాల్సిన బాధ్యత మీ ప్రాంతంలో పుట్టిన ఉద్యమకారులుగా మనపై ఎంతైనా ఉందని అన్నారు. రానున్న రోజుల్లో తెలంగాణ ఉద్యమం తరహాలో మరో ఉద్యమానికి తెలంగాణ ప్రజలు స్వీకారం చుట్టాలని పిలుపునిచ్చారు. బిఎస్ఎఫ్ 19వ వార్షికోత్సవ కార్యక్రమానికి విశిష్టత అతిథిగా విచ్చేసిన నిజం కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మనోహర్ గారు బిఎస్ఎఫ్ జెండావిష్కరణ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. బిఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బోరెల్లి సురేష్ మాట్లాడుతూ విద్యార్థి సమస్యలపై అనేక పోరాటాలు చేసిన బిఎస్ఎఫ్ 18 వసంతాలు పూర్తిచేసుకుని 19వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా బిఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీకి శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థి సమస్యల పట్ల తెలంగాణ ప్రజల కల్తీ



మయం నుంచి రక్షించుకోవడానికి బిఎస్ఎఫ్ ఇప్పుడు ముందు వరుసలో ఉంటుందని ఉన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణ, బిఎస్ఎఫ్ ఉస్మానియా యూనివర్సిటీ అధ్యక్షులు కల్వకుర్తి శ్రీశైలం, ఓయూ నాయకులు ఆరెకంటి శ్రీకాంత్, యూనివర్సిటీ సీనియర్ రీసెర్చ్ స్కాలర్ యుగంధర్,రాష్ట్ర నాయకులు పాల్వాయి విజయ్, ప్రసాద్, పండారి, గుడిపల్లి శ్రీకాంత్, మాదిగ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు జోగు గణేష్, యువజన నాయకులు గుర్రం కొటేష్, బాలు, కోదాడ రవి, చాగంటి శేఖర్, మల్లేష్, రాజు, ప్రవీణ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు

# వాడపల్లి ఎస్ ఐ ని సస్పెండ్ చేయాలి

### జిల్లా ఎస్పీని ఆదేశించిన ఎస్టి, ఎస్సీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

మిర్యాలగూడ , సెప్టెంబర్ 28:-( వార్త మిర్రర్) నల్గొండ జిల్లా, దామరచర్ల మండలం కొత్త తాండకు చెందిన సాయి సిద్దు పై అకారణంగా కులం పేరుతో దూషించి, థర్డ్ డిగ్రీ ప్రయోగించిన వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డిని విధుల నుండి సస్పెండ్ చేయాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా ఎస్పీని ఆదివారం ఆదేశించారు. ఎస్ఐ ను సస్పెండ్ చేయడమే కాకుండా, సమగ్ర విచారణ జరపాలన్నారు.యూరియా కోసం ధర్నా చేసిన విషయంలో ఈ నెల 9న ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి సాయి సిద్ధును విచారణ పేరుతో పిలిపించి తనను కులం పేరుతో దూషించడమే కాకుండా, కొట్టారని రాష్ట్ర ఎస్సి, ఎస్టి కమిషన్ కు పిర్యాదు చేసిన నేపథ్యంలో ఆదివారం రాష్ట్ర ఎస్సి, ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకయ్య నల్గొండ జిల్లా దామరచర్ల మండలం కొత్త తండాలో బాధితుడు సాయి సిద్దు ఇంటికి వెళ్లి పరామర్శించారు. అకారణంగా కొట్టడమే కాకుండా వారి కుటుంబంపై తీవ్ర పదజాలంతో దూషించడం థర్డ్ డిగ్రీ ప్రయోగించడం తగదని అన్నారు. రాజ్యాంగాన్ని కాపాడాల్సిన ఎస్ఐ ఈ రకంగా ప్రవర్తిస్తే కంచే చేను మేసిన తీరుగా ఉందని తెలిపారు. అన్యాయం జరిగినప్పుడు ఫిర్యాదు చేసేందుకు ప్రజలు పోలీసుల దగ్గరికి వస్తే పోలీసులే ఇలా ప్రవర్తిస్తే ఎవరికి చెప్పుకోవాలని అన్నారు. ప్రజలను కాపాడాల్సిన ఎస్ఐ తప్పు చేస్తే ఎలా అని ప్రశ్నించారు. ఎవరైనా తప్పు చేస్తే శిక్షించేందుకు చట్టం ఉందని, కొట్టాల్సిన అవసరం లేదని, కొట్టే అధికారం లేదని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి సైతం పోలీసులను ఫ్రెండ్లీ పోలీస్ గా ఉండాలని సూచిస్తున్నారని అన్నారు. ఎస్టీ లంబాడా అని సాయి సిద్దును తిట్టడం దారుణమని, సాయి సిద్దుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణమని తెలిపారు. అందువలన ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డిని తక్షణమే సస్పెండ్ చేయాలని ఎస్పీని ఆదేశించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ నిర్వహించాలని, ఈ విషయం రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడుతానని తెలిపారు. ఫోన్ లో



రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ శాఖ మంత్రి, నల్గొండ ఇన్చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తో మాట్లాడటం జరిగిందని, సాయి సిద్దు కుటుంబాన్ని ఆదుకోవాలని, వైద్యపరంగా అయ్యే ఖర్చులు ప్రభుత్వం ఇవ్వాలని, ఎస్ఐపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సాయి సిద్దు కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఎస్సీ కమిషన్ అండగా ఉంటుందని తెలిపారు.ఎస్సి ఎస్టీ కమిషన్ సభ్యులు జిల్లా శంకర్, రాథోడ్ రాంబాబు, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి శశికళ, గిరిజన సంక్షేమ అధికారి చత్రునాయక్, డిఎస్పి కె.రాజ శేఖర్రాజు, తహసిల్దార్ జవహర్ లాల్, మార్కెట్ మాజీ చైర్మన్ డి. చిట్టిబాబునాయక్, టీఆర్జీఎస్ అధ్యక్షుడు డి. రవినాయక్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్, నాగునాయక్, ధీరావత్ శీనునాయక్, గణేష్ నాయక్, రవినాయక్ ఉన్నారు.



## తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టే జానయ్య యాదవ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన పోచబోయిన జగదీష్ యాదవ్

ఎల్బీనగర్ 28 సెప్టెంబర్: తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వట్టె జానయ్య యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు. జానయ్య యాదవ్ జన్మదిన సందర్భంగా ఎల్బీనగర్ యాదవ సంఘం సీనియర్ నాయకులు, మన్సూరాబాద్ డివిజన్ మాజీ బి ఆర్ ఎస్ అధ్యక్షులు పోచబోయిన జగదీష్ యాదవ్ ఆధ్వర్యంలో ఒట్టే జానయ్య యాదవ్ ని కలిసి ఆయనకు పూలే బోకెను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వీరితో పాటు బిఆర్ఎస్ నాయకులు రుద్రాల యాదగిరి, యాదవ సంఘం నాయకులు రాఘవేంద్ర యాదవ్, బిక్షపతి యాదవ్, భాస్కర్ యాదవ్,నరేష్ యాదవ్, సాయి యాదవ్, చిన్న యాదవ్, గణేష్ యాదవ్, నాగరాజ్, ప్రశాంత్, శ్రీకాంత్ , సంజయ్, ఉపేందర్, సందీప్ ,వంశీ , బలరామ్, మహేష్, సురేష్, విష్ణు ,గోపి తదితరులు పాల్గొన్నారు.



## ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్, ఆధ్వర్యంలో శ్రీదుర్గాదేవి ప్రతిష్ట ఉత్తమ మండపం అవార్డ్స్ కు ఎన్నికైన

### అనంతరం, బస్వాపురం, బొమ్మలరామారం గ్రామాల శ్రీ దుర్గా మాత ఉత్తమప్రతిష్ట మండపాలు

### అవార్డ్స్ ను అందజేయనున్న సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్, ఎన్ఎస్ఎస్ ఎఫ్ మీడియా ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం పలు జిల్లాలలో శ్రీ దుర్గా నవరాత్రి ఉత్సవాల్లో శ్రీ దుర్గా దేవి ఉత్తమ మండపం అవార్డ్స్ లు ఇవ్వడం జరుగుతుంది ఈ సంవత్సరం యాదాద్రి భువనగిరి జిల్లా లో బొమ్మలరామారం, బస్వాపురం, అనంతరం గ్రామాలలో నెలకొల్పిన శ్రీ దుర్గా మాత ప్రతిష్ట ఉత్తమ అవార్డ్స్ ను ఎన్నిక కాబడ్డాయి,ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్, ఎన్ఎస్ఎస్ మీడియా ప్రతినిధి గణేష్ సాగర్ ఆధ్వర్యంలో ఈ గ్రామాల శ్రీ దుర్గామాత ఉత్తమ ప్రతిష్ట మండపం అవార్డ్స్ ను బిఆర్ఎస్ జిల్లా నాయకులు, సామాజికవేత్త డాక్టర్ రేకల శ్రీనివాస్ చేతుల మీదుగా రేపు సోమవారం సాయంత్రం పలు గ్రామాల శ్రీ శ్రీ దుర్గాదేవి మండపాల వద్దకు వెళ్లి ఉత్సవ కమిటీ సభ్యులకు ఉత్తమ ప్రతిష్ట అవార్డులను అందజేయడం జరుగుతుందని ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్, మీడియా యాదాద్రి జిల్లా ప్రతినిధి గణేష్ సాగర్ తెలిపారు

# కీ.శే.కటిక రెడ్డి కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం

### శ్రీశ్రీశ్రీ లక్ష్మినరసింహ స్వామి వారి దేవస్థానం ముఖద్వారం నేడు ప్రారంభం

### ముఖ్యఅతిథిగా హాజరుకానున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, 28 సెప్టెంబర్ కటికరెడ్డి క్రిష్ణారెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారుడు కటికరెడ్డి అరవింద రెడ్డి మౌనిక రెడ్డిల చే నిర్మించబడినశ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి షీలా తోరణం (ముఖద్వారం) సోమవారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, బి ఆర్ ఎస్ డివిజన్ అధ్యక్షులు కటిక రెడ్డి అరవింద్ రెడ్డి లు హాజరవుతారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ముఖద్వారం దగ్గర ఉదయం 8 గంటల నుండి పూజకార్యక్రమం, హోమం నిర్వహిస్తున్నామని కావున భక్తులందరు ఇట్టి పూజ కార్యక్రమం లో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు మరియు అల్పాహారం స్వీకరించగలరని కోరారు.కార్యస్థలం గణేష్ ఎలక్ట్రికల్ పక్కన, బి ఎన్ రెడ్డి నగర్ మెయిన్ రోడ్డు లో ఏర్పాటు చేశామని వారు వెల్లడించారు. ఈ యొక్క కార్యక్రమానికి ప్రతి ఒక్కరు హాజరుకావాలనిశ్రీశ్రీ లక్ష్మినర్సింహ స్వామి దేవస్థాన కమిటీ మరియు శ్రీ కృష్ణదేవరాయనగర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు కోరారు.



## మహా చండీ అవతారంలో దర్శనమిచ్చిన అమ్మవారు

### - పూజలో పాల్గొన్న చికోటి ప్రవీణ్,మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ,

కల్వకుర్తి సెప్టెంబర్ 28 వార్త మిర్రర్ ప్రతినిధి:- దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా ఆది వారం 7వ రోజు అమ్మవారు మహా చండీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.కల్వకుర్తి లో కన్యకా పరమేశ్వరి ఆలయం చైర్మన్ రమేష్ బాబు, ఆధ్వర్యంలో నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు బిజెపి నాయకులు చీకోటి ప్రవీణ్,మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు రాగా పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారు మహా చండీ అవతారంలో భక్తులు, దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు, భక్తులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# షష్టి పర్వదినం పురస్కరించు కొని ప్రత్యేక పల్లకి సేవ..



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి సెప్టెంబర్ 28 ఆదివారం భానువాసరే ఆశ్వీయుజ మాసం శుక్ల పక్షం షష్టి పర్వదినం సందర్భంగా శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో ప్రత్యేక పల్లకి సేవ. సూర్య భగవానుని విశిష్టత :ఆదివారం – సూర్య భగవానుని ప్రత్యేక దినం ఆదివారం హిందూ సాంప్రదాయంలో సూర్య భగవానుని (సూర్యుని)కి అంకితమైన పవిత్రమైన రోజు. ఈ రోజు సూర్యదేవుని ఆరాధించడం వల్ల ఆరోగ్యము, ఆయుష్మానుభవం, విజయం, ధనం, మరియు ప్రసిద్ధి లభిస్తాయని విశ్వాసం ఉంది. అష్టమి పర్వదినం పురస్కరించుకొని జగిత్యాల పట్టణం లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో శ్రీ సూర్య భగ వానుకి, ప్రత్యేక పూజల అనంతరం ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమములో ఫౌండర్ అండ్ ఛైర్మెన్ డాక్టర్ వడ్ల గట్ట రాజన్న, వోడ్నాల శ్రీనివాస, మేనేజింగ్ ట్రస్ట్ గట్టు రాజెందర్, భారతాల రాజసాగర్, రాజేష్, సత్యనారాయణ, నాయిని విద్యాసాగర్ రావు, సాయి కృష్ణ, ప్రవీణ్, డాక్టర్ ధనుంజయ, శ్రీ శైలం, అర్చకులు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. సూర్యుని మంత్రం: ఓం సూర్యాయ నమః

# వనపర్తి లో శ్రీ భగీరథ మహర్షి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

### విగ్రహాన్ని ఆవిష్కరించిన తెలంగాణ సాగర రథసారధి ఉప్పరి శేఖర్ సగర

### వార్డు స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సగరులు స్థానిక ఎన్నికల్లో పోటీ చేయాలి.





యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి వనపర్తి పట్టణ అధ్యక్షులు చీర్ల గోవర్ధన్ సగర ఆధ్వర్యంలో వనపర్తి పట్టణంలో జరిగిన సగర కుల గురువు శ్రీ భగీరథ మహర్షి విగ్రహాన్ని సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తిరుపతయ్య సగర,రాష్ట్ర గౌరవాధ్యక్షులు ముత్యాల హరికిషన్ సగర,ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర, గౌరవ సలహాదారులు ఆంజనేయులు సగర, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సగర, జిల్లా ప్రధాన కార్యదర్శి గొబ్బూరి చెంరాయుడు సగర, కోశాధికారి గుంటి సత్యం సగర, రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుక సత్యం సగర, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చీర్ల శ్రీనివాస్ సగర, గ్రేటర్ హైదరాబాద్ సగర సంఘం అధ్యక్షులు మోడల రవి సగర, గ్రేటర్ హైదరాబాద్ గౌరవాధ్యక్షులు వెంకటస్వామి సగర, ప్రధాన కార్యదర్శి ఆవుల వెంకట్రాములు సగర, కోశాధికారి దిండి రామస్వామి సగర తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఉప్పరి శేఖర్ సగర మాట్లాడుతూ స్థానిక ఎన్నికలో మన సగరులు సత్తా చాటలని పిలుపు నిచ్చారు వార్డ్ నుంచి జిల్లా పదవుల వరకు పోటీ చేసే సగరులకు తెలంగాణ సగర సంఘం అండగా ఉంట్టుంది అన్నారు. ఈ కార్యక్రమం లో చిర్ల జనార్దన్ సగర జిల్లా నాయకులు వనపర్తి పట్టణ నాయకులు మండల, గ్రామ కమిటీలు భారీ సంఖ్యలో మన సగర బంధువులు భగీరథ మహర్షి విగ్రహ ఆవిష్కరణలోపాల్గొన్నారు

# భువనగిరి నియోజకవర్గంలో పైళ్ల శేఖర్ రెడ్డి చేపట్టినటువంటి అభివృద్ధి ప్రజలకు కనబడుతుంది

### ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వంలో 2 సంవత్సరాల కాల పరిధిలో మీ అభివృద్ధి ఏంటో ప్రజలకు చూపించండి.

### భువనగిరి నియోజకవర్గంలో ప్రతి పల్లె, గ్రామ, పట్టణ అభివృద్ధి పైళ్ళ శేఖర్ రెడ్డి కృషి .. బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి భువనగిరి నియోజకవర్గంలో నేడు వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను బాగుచేసే నాయకుడే కరువయ్యాడని, గ్రామ పంచాయతీల పాలన అస్తవ్యస్తంగా మారిందని, రెండు సంవత్సరాల ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యమని అన్నారు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, భువనగిరి నియోజకవర్గంలో అభివృద్ధి ఆనవాళ్లు కనపడడం లేదని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు, గత కెసిఆర్ ప్రభుత్వంలో పైళ్ళ శేఖర్ రెడ్డి నాయకత్వంలో ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డు, రైతు వేదికలు, పర్యావరణం కై గ్రామంలో ప్రతి చెట్టు పెరగాలని వాటికి నీరు అందించాలని టక్టర్లను అందజేసి, ప్రతి గ్రామంలో సిసి రోడ్ల ఏర్పాటు చేసి, ప్రతి గ్రామానికి 24 గంటల కరెంటు అందించి, వీధిలైట్ల ఏర్పాట్లకు కృషిచేసి, ఎన్నో గ్రామ అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం ద్వారా నిధులు మంజూరయ్యాయని తెలిపారు, గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం గణనీయమైన నిధులు తీసుకొచ్చారని తెలిపారు, రైతులకు మద్దతు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి శుద్ధమైన సాగునీరు అందించేందుకు చర్యలు చేపట్టారని తెలిపారు, రైతుల కోసం రైతుబంధు, రైతు బీమా, వంటి చారిత్రాత్రిక పథకాలను అమలు చేయడంలో కెసిఆర్ ప్రభుత్వం కృషిచేసిందని తెలిపారు, వ్యవసాయానికి కావాల్సిన యూరియా తదితర వస్త్ర రసాయనాల కొత్త పై స్పందించి సమస్యను పరిష్కరించారని తెలిపారు, పేదింటి ఆడపిల్లల పెళ్లి కోసం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా లభ్యమయ్యే అర్హుల కుటుంబాలకు 1లక్ష 16 వేలు అందించే పథకాలను అమలు చేశారని తెలిపారు, తెలంగాణ సమాజం బలోపేతంకై కేసీఆర్ కిట్టు, న్యూట్రిషన్ కిట్లను అందజేసిందని, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు వృద్ధులకు, బీడీ కార్మికులకు ప్రభుత్వం పెన్షన్ కల్పించేలా కృషి చేసిన అని మరొకసారి గుర్తు చేశారు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, ఎస్సీ,ఎస్టీ ,బీసీ మైనార్టీల సంక్షేమానికి నిధులు కేటాయించేందుకు కృషి చేశారు అని తెలిపారు, పార్టీ ప్రజాధనంతో గట్టి బంధం తో తో భువనగిరి నియోజకవర్గం లో నడిపించేందుకు శాయశక్తుల కృషి చేశారని ప్రజలకు హామీలు అమలు చేయడంలో పాలకంగా మరింత నిబంధన చూపించారని తెలిపారు. నేటి ఈ ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడుస్తున్న నేడు భువనగిరి నియోజకవర్గ ప్రజలకు మీరేం చేశారు తెలపాలని డిమాండ్ చేశారు బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



# గౌడ సంఘ భవనంకు 50 లక్షలు మంజూరు చేసిన మంత్రి పొన్నం, ఎమ్మెల్యే బిఎల్ఆర్

### జిల్లా కాంగ్రెస్ స్టార్ క్యాంపినర్ చైర్మన్ వెంకటేష్ గౌడ్,



మిర్యాలగూడ ,సెప్టెంబర్ 28:-( వార్త మిర్రర్) మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్మిర్యాలగూడ పట్టణంలో గౌడ సంఘం బిల్డింగుకు రూ.50 లక్షల రూపాయలు మంజూరు చేసినందుకు. మిర్యాలగూడ నియోజకవర్గంను అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి నాయకత్వంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మిర్యాలగూడ డివిజన్ గౌడ సంక్షేమ సంఘం పెద్దలు మిర్యాలగూడకు వచ్చిన రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ని కలిసి మిర్యాలగూడలో ఎమ్మెల్యే సహకారంతో రూ.3 కోట్ల అంచనాతో నిర్మాణం చేస్తున్న సర్దార్ సర్వాయి పాపన్న కౌండిన్య భవనం పనుల గురించి సంఘం అధ్యక్షుల గుండు శ్రీరాములు గౌడ్ నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపినర్ చైర్మన్ పోలగాని వెంకటేష్ గౌడ్, వివరించారు. ప్రభుత్వ పరంగా సహాయాన్ని అభ్యర్థించారు.మీ ఎమ్మెల్యే సహకారంతో సర్దార్ సర్వాయి పాపన్న భవన నిర్మాణం కోసం రూ.50 లక్షల రూపాయలను ఇప్పిస్తానని మంత్రి అన్నారు. మీరు యదేచ్ఛగా పనులు చేయించుకోండని పూర్తి భరోసా ఇచ్చారని అన్నారు. వెంటనే ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి భవనం సహకారంతో చేయిస్తున్నాను. మంత్రి ద్వారా 50 లక్షల రూపాయలు ఇచ్చే బాధ్యత పూర్తిగా నాదేనని అన్నారు .ఒక్క నెల లోపల మీకు నచ్చిన విధంగా అందించడం జరుగుతుందని మంత్రి వాగ్దానం చేశారు. కాంగ్రెస్ నాయకులు ఉదయ భాస్కర్ గౌడ్, చౌగాని వెంకన్న, చౌగాని యాదగిరిగౌడ్, సంఘం పెద్దలు పందిర్ల గురుమూర్తి గౌడ్, పెద్ది శ్రీనివాస్ గౌడ్,జెర్రిపోతుల రాములు గౌడ్ మంత్రి ఎమ్మెల్యేలకు హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు.

# ఒకే టికెట్‌తో దేశమంతా తిరగొచ్చు! ఐఆర్‌సీటీసీ ప్లాన్ అదుర్స్

తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించేందుకు రైలు మార్గాన్ని మించిన ఆప్షన్ లేదు. అందుకే చాలామంది ఎక్కడికెళ్లాలన్నా రైలు ప్రయాణాన్నే ఎంచుకుంటారు. అయితే రకరకాల పనుల మీద రోజూ వందల కిలోమీటర్లు ప్రయాణించే వాళ్ల కోసం ఐఆర్‌సీటీసీ.. ఓ కొత్త సర్వీస్ తీసుకొచ్చింది. ఈ సర్వీస్ ద్వారా ఒకే టికెట్ తో దేశమంతా తిరగొచ్చు. అదెలాగంటే..తరచుగా వివిధ ప్రాంతాలు తిరిగే వాళ్ల కోసం ఐఆర్ సీటీసీలో 'సర్కులర్ జర్నీ టికెట్' అనే సర్వీసు ఉందని మీకు తెలుసా? ఈ టికెట్ ఒకసారి తీసుకుంటే రూట్ ను బట్టి 56 రోజుల పాటు ఎన్నిసార్లైనా ఎన్ని జర్నీలైనా చేయొచ్చు.56 రోజుల పాటు..ఇండియన్ రైల్వేస్ అందిస్తున్న 'సర్క్యులర్ జర్నీ టికెట్' ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణం చేయొచ్చు. ఒకచోట ప్రయాణాన్ని మొదలుపెట్టి.. గరిష్టంగా 56 రోజుల పాటు ప్రయాణించి మళ్లీ తిరిగి స్టార్టింగ్ పాయింట్‌కు చేరుకునే వరకు ఈ సర్కులర్ టికెట్ వ్యాలిడిటీ ఉంటుంది. మొత్తం ప్రయాణంలో ఎనిమిది జర్నీ బ్రేక్‌లు తీసుకోవచ్చు. అంటే మధ్యలో ఎంపిక చేసుకున్న ఎనిమిది స్టేషన్లలో దిగి, కొద్దిరోజులు ఆ ప్రదేశాన్ని సందర్శించి మళ్లీ తిరిగి జర్నీ కంటిన్యూ చేయొచ్చు. ఇలా 56 రోజులపాటు ఒకే టికెట్‌తో ప్రయాణం చేసే వీలుంటుంది.మల్టిపుల్ రూట్స్ఈ టికెట్ మల్టిపుల్ రూట్ ఆప్షన్స్ లో అందుబాటులో ఉంది. ఉదాహరణకు హైదరాబాద్%-% మంత్రాలయం రోడ్ %-% తిరుపతి బెంగళూరు%-% చెన్నై%-% భద్రాచలం రోడ్%-% హైదరాబాద్.. ఇది ఒక రూట్. ఇలా.. 30 కి పైగా రూట్స్ ఉన్నాయి. అది కేవలం సౌత్ సెంట్రల్ జోన్ లో మాత్రమే. ఇలా వేర్వేరు జోన్స్ లో మల్టిపుల్ రూట్ ఆప్షన్స్ ఉన్నాయి. ఐఆర్ సీటీసీ వెబ్ సైట్ లో ఈ రూట్స్ వివరాలు చెక్ చేయొచ్చు.వీరికి బెస్ట్ఉద్యోగ, వ్యాపార పనుల మీద అనేక ప్రాంతాలు తిరిగేవాళ్లకు అలాగే ఒకేసారి ఎక్కువ విహార యాత్రలు, తీర్థయాత్రలు చేయాలనుకునేవాళ్లకు